
# ఊహాకందని లోతులు




అక్కడికి చేరడానికి అనేక మార్గాలున్నాయి!

అయితే ఆ అనేకానేక మార్గాల్లో ఆ ఒక్కగానొక్క మార్గం మీద నడవడ మంటే నాకు మహా యిష్టం. అందుకే ప్రతిదినము సాయంకాలం ఆ మార్గం మీదనే నడుస్తాను. అక్కడికి చేరుకుంటాను.

అక్కడ మాట్లాడడానికి మనుష్యు లుండరు. మత్తెక్కించడానికి మధువు దొరకదు. మనసైన మగువలుండరు. అయితే అక్కడ కూర్చుంటే ఎంత సేపయినా కూర్చొనడానికి మనసవుతుంది. మత్తెక్కుతుంది. మాట్లాడు కోవలసివస్తుంది మూగగా! అది ప్రకృతి మాత ఒడి! ప్రశాంతత కోసం వెతుక్కొన్న గుడి!!

ఆ అమ్మాయి పేరు స్వరాజ్యం. ఆరాధనా పూర్వకమయింది కొందరి అందం. కవ్వించేది మరికొందరి అందం. స్వరాజ్యం అందం మునిపుంగవుల్ని కూడా కవ్వించేది!

స్వరాజ్యాన్ని సాధించడానికి ఎందరో అసువులు బాసినారు. ఆస్తిపాస్తుల్ని తగులబెట్టుకొన్నారు. జైళ్ళల్లో మగ్గారు. స్వాతంత్ర్య సమరయోధులనిపించుకొన్నారు. ఇది మన జాతి చరిత్ర!

అయితే అందమైన స్వరాజ్యం కోసం ఎందరో కళాశాల విద్యార్థులు జుట్లు పెంచుకొన్నారు. గడ్డాలు పెంచుకొన్నారు. జుట్లు బాగా పెరిగిన దశలో ఒకరిజుట్లు ఒకరు పెరుక్కొన్నారు. రోడ్డు రోమియోలయ్యారు. స్వరాజ్యం విరహ పీడితులని వాసికెక్కారు. ఇది మా వూరి చరిత్ర!

అలాంటి అందమైన స్వరాజ్యం ఒకనాడు, మా ఊళ్ళో ఒకానొక దేవాలయానికి వచ్చింది. ఉత్సవాలలో మునిగి తేలుతున్న దేవుణ్ణి చూడడానికని ఆమె వస్తే - ఆమెను చూడడానికని చాలమంది వచ్చారు. చూడడానికని వచ్చినవాళ్ళు చూస్తే సరిపోయేది. చూస్తూ ఊరకుండలేకపోయారు. అది వాళ్ళ తప్పుగాదు. అది వయసుదోషం. వయసుముందు వయ్యారాలు అగ్గికి గాలి తోడయినట్లే!—ఒకడు సమయంచూచి పైట లాగాడు. మరొకడు సందుచూచి జడను లాగాడు. ఒకడు యికిలించాడు. ఇంకొకడు సకిలించాడు. అటు తర్వాత అందరు ఆమెను చుట్టుముట్టి అటుయిటూ కదలనివ్వకుండా నిలబెట్టారు!

ఆమె మాత్రం భయపడిందా? పేరే స్వరాజ్యం. లాగి ఒక్క చెంపదెబ్బ కొట్టింది ఒకణ్ణి. ఆ దెబ్బతో కుర్రకారు రెచ్చిపోయారు. అందరు కలిసి ఆమెమీద పడ్డారు నేటి రాజకీయ నాయకులు దేశం మీదపడ్డట్టు! ఎవరి చేతికి ఏమి దొరికితే దానితో ఏమి చేయాలో అది చేసుకొంటున్నారు.

స్వరాజ్యం స్పృహతప్పి పడిపోయింది.

దేవుడు దీనిని గమనించే స్థితిలో లేడు. వాహనంమీద వయ్యారాలు పోతూ ముందుకు సాగిపోతున్నాడు.

ఆ దృశ్యంచూసిన నా కడుపు తరుక్కుపోయింది. ఒక్క ఊపులో ఆ గుంపులో జొరబడ్డాను. "అలా చూస్తూ చూస్తూ నిలబడ్డారే! మీ కెవరికీ అక్క చెల్లెళ్ళు లేరా?" అని అరుస్తూ వాళ్ళమీద విరుచుకు పడ్డాను. నా అరుపులతో మేలుకొనింది అక్కడ చేరిన గుంపు.

విద్యార్థులు దిక్కుకొకరుగా చెదిరిపోయారు.

ఆ తరువాత ఆ అమ్మాయిని రెండు చేతులతో జవురుకొన్నాను. ఓ మిత్రుని కారు అక్కడ వుంటే అందులో పడుకోబెట్టాను. సురక్షితంగా యిల్లు చేర్చాను. ఈ సంఘటన జరిగిన తరువాత నన్నొక 'హీరో'లా చూశారు ఆ వీధిలోని జనం. ఆ వీధిలోనే స్వరాజ్యలక్ష్మి వుండేది. అందుకే ఆ వీధిలో నడవడమంటే నాకు మహా సరదా!

ఆ ప్రక్కన యింట్లోనే సువర్ణ ఉంది. నేను వెళ్ళే సమయానికి ఆమె వీధివాకిలి గుమ్మానికి ఆనుకొని నిలబడి ఉంటుంది. ఆమె రంగు సంధ్యారుణ కాంతిలో పోటీపడుతూ ఉంటుంది. ఆమె బుగ్గలతోనే నవ్వుతుంది. కండ్ల తోనే పలకరిస్తుంది. ఆమెను ఊహిస్తే ఊర్వశి ఎదుట నిలబడుతుంది. మేనక తిలోత్తమలు ముందు సాక్షాత్కరిస్తారు. ఆమెను చూస్తూ నడవడం-కాదు విషాన్ని కూడా అమృతంలాగ తాగవచ్చు. అందుకే ఆ వీధిలో నడవడం నాకు సరదా!

సువర్ణ యింటికి సరిగ్గా నాలుగో యింట్లో శాంత వుంది. ఆ అమ్మాయి పేరుకుతగ్గ మనిషి. మనసిచ్చిన వాడిని మెచ్చింది. మెచ్చినవాడినే కట్టుకొనింది. కట్టుకొన్నవాడితో కాపురం చేస్తూ పిల్లల కోడిలా కనబడుతుంది. ఆ అమ్మాయిని చూస్తే నాకు చాలా గౌరవం. ఆ వీధిలో నడుస్తూ ఆమెను గురించి ఆలోచిస్తుంటాను.

శాంత యిల్లు దాటగానే రోడ్డు మలుపు తిరుగుతుంది. ఆ మలుపులో ఓ కిళ్ళీకొట్టు!

చాలా కొద్దిపాటి స్థలంలో ఫెద్దగా ఆలోచించి అమర్చిన కిళ్ళీకొట్టు అది. దోరగా మాగిన అరటిగెలలు ముందు వ్రేలాడుతుంటాయి. పిప్పర మెంట్లు బిస్కత్తులతో నిండిన సీసాలు....అర్ధవృత్తాకృతిలో అవి అమరిన తీరు....చూడ ముచ్చటగా వుంటుంది. అందమైన అద్దాల బీరువాల్లో రక రకాల సామగ్రులు పొందికగా పేర్చబడి వుంటాయి. ఓ పళ్ళెం తళతళ మెరుస్తూ వ్రేలాడుతూ వుంటుంది. ఆ పళ్ళెంలో బొమ్మలకు పెట్టిన పచ్చని టోపీల్లా 'బీడా'లుంటాయి. ప్రక్కనే ఓ కిరసనాయిలు దీపం వెలు గుతూ వుంటుంది దిష్టిచుక్కలాగా!

సాధారణంగా ఏ కిళ్ళీకొట్టును చూసినా యిలాగే వుంటుంది. అయితే ఏ కిళ్ళీకొట్టుముందు లేనంతటి సందడి ఈ కిళ్ళీకొట్టు ముందుండడానికి కారణం ఆ కిళ్ళీకొట్టులో సరకు అందంగాదు. ఆ కిళ్ళీకొట్టులో కూర్చున్న ఆమె సౌందర్యం! - ఆమె ఓ అలేఖ్యతనూవిలాసిని!

ఆ అలేఖ్య తనూవిలాసిని ఓ యన్జీవోగారి సతీమణి!

చిరిగిన చెప్పులు....నలిగిన పంట్లాం....అంతకంటే నలిగిన చొక్కా పెరిగిన గడ్డం....గంపెడు పిల్లలు....ఓ గుంపు సంసారం....ఆదిగాగల యన్జీవో లక్షణాలలో దేనికీ తీసిపోడు ఈ పుణ్యాత్ముడు కూడా! అయితే ఈ ఎన్జీవోగారికి కాస్త తెలివితేటలు ఎక్కువగా వున్నట్లు తోస్తుంది, మిగతా వాళ్ళతో పోల్చిచూస్తే!

అతడు పనిచేసే ఆఫీసు యెదుట ఓ చిన్న పూరిగుడిసె వుంది. ఆ గుడిసెలో యిద్దరు ఆలుమగలు. వాళ్ళకు ముగ్గురు పిల్లలు. ఆ యింటి యజమానికి తెలిసిన విషయాలు రెండే! ఒకటి: తాగడం. రెండు: ఆ కైపులో పెళ్ళాన్ని చావదన్నడం. అయినా నోరు కదిపేది కాదు ఆ మహా సాధ్వి. అతగాడు పైసాపని చేయలేకపోయినా పైసలిచ్చేది తాగడానికి.

ఇరుగు పొరుగు ఆమెను పతివ్రత అంటారు. ఆ మాట నిలబెట్టుకోవడానికి ఆమె చాలా కష్టపడుతుంది పాపం! కాపురముంటున్నది గుడిసె అయినా చాలా శుభ్రంగా వుంచుతుంది. పిల్లలమీద ఈగ వాలనీయదు. ఇంతటికీ ఆమె సంసారాన్ని ఎలా నెట్టుకొస్తూంది అంటే ఆ గుడిసెముందు ఓ ఆరుగు కట్టుకొనింది. ఆ అరుగుమీద నాలుగురకాల పిప్పరమెంట్లు నాల్గు సీసాల్లో వుంచుతుంది. ఓ డబ్బానిండుగా వేరుశెనగ ఉండలుంచుతుంది. ఓ చిన్న బుట్టలో నాలుగు కట్టల బీడీలు. అయిదారు రకాల సిగరెట్టు పెట్టెలు, ఓ డజను అగ్గిపెట్టెలు ఉంచుతుంది. ఆ అరుగు ఆమె పాలిటికి ఒక కొట్టు! - ఆమె మనుగడకే ఆటపట్టు!!

ఆ గుడిసెకు ఎదురుగా ఓ పాఠశాల. ప్రక్కన ఓ ఆఫీసు. ఆఫీసులో ఎన్జీవోలు వేసారిన జీవితాలకు రక్తి చేకూర్చటానికి బీడీ, సిగరెట్టు కొంటారు. చవీసారంలేని చదువులతో నోరు చప్పబడిన బడిపిల్లలు పిప్పర మెంట్లు కొంటారు. దీనితోనే గుట్టుగా సంసారం నెట్టుకొస్తూ వుంది ఆ గృహలక్ష్మి.

ఇదంతా గమనించాడు ఎన్జీవో! పొద్దస్తమానం గాడిద చాకిరి చేసినా అందరికి కడుపునిండా కూడుబెట్టలేక సతమతమవుతున్నాడు తాను. తన బ్రతుక్కంటే యీ గుడిసెబ్రతుకే ఎన్నోరెట్లు నయం. ఆలోచించాడు ఎన్జీవో! తీవ్రంగా ఆలోచించాడు. ఎన్జీవో తెలివికిమించి ఆలోచించాడు. ఆ ఆలోచనాపర్యవసానమే మూడురోడ్లు కలిసేచోట ముచ్చటయిన కిళ్ళీ కొట్టు!

అందమయిన తన అర్ధాంగిని అంగట్లో కూర్చోబెట్టడం అతని తెలివి తేటలకు మరో నిదర్శనం.

నేను ఆ కిళ్ళీకొట్టు ముందు నడుస్తున్నప్పటికి సంజచీకటి ఆవరిస్తూ వుంటుంది. కొట్టుముందు వెండివెలుగులు ప్రసరిస్తుంటాయి. ఆ వెలుగుల్ని ప్రసరిస్తున్నది ట్యూబ్‌లైటా? లేదు-ఆమె ధరించిన 'మూన్‌కట్' జాకెట్టా?

నిదానించి చూడవలసివస్తుంది. అలా చూస్తుంటే ఆ వెలుగులకే వెలుగునిస్తూ ఉంటుంది కొట్టుమధ్యలో కూర్చున్న జవ్వని. ఆమె చిరునవ్వులు సిగపూలతో పోటీపడుతుంటాయి. గుమిగూడిన వాళ్ళ చేతులు జేబులతో పోటీపడుతుంటాయి. పసుపు కుంకుమ అలంకారాలతో కళకళలాడుతున్న గల్లాపెట్టె గలగల నవ్వుతుంటుంది. అల్లంత దవ్వులో మరో కిళ్ళీకొట్టు వున్నవాడిముందు లేనివాడిలా....తింటున్నవాడి ముందు ఆకలి కొన్నవాడిలా.... దీనంగా నిలబడివుంది. పాపం! చూస్తే జాలివేస్తుంది.

సాయంకాలంపూట వాహ్యాళికి బయలుదేరితే స్వరాజ్యలక్ష్మి మనసులో మెదులుతుంది. సువర్ణకండ్లతో పలకరించి బుగ్గలతోనే నవ్వుతుంది. శాంతమీద గౌరవభావం యినుమడిస్తుంది. కిళ్ళీకొట్టు అందాన్ని కిళ్ళీలా నమల బుద్ధి అవుతుంది.

ఆ దారిమీద నడుస్తుంటే యిన్ని అనుభవాలతో గుండె బరువెక్కుతుంది. నడక మందగిస్తుంది. ఊరుదాటి ఆరుబయట చేరేసరికి కారుచీకటి విచ్చుకత్తులు విసురుతూ వుంటుంది. అక్కడొకటి అక్కడొకటిగా వెలుగుతున్న విద్యుద్దీపాలు చీకటిని ఛేదించడానికి వ్యర్థప్రయత్నాలు చేస్తుంటాయి.

అక్కడ పచ్చికమీద చతికిలబడడం హాయిగా వుంటుంది. చుట్టూ రాళ్ళు రప్పలు....పొడిచెట్లు....ఆ పొడిచెట్లమీద నోరులేని గువ్వలు! ఒక చెట్టుమీద నుండి యెగిరి మరో చెట్టుమీద వాలుతుంటాయి. కొండంత చీకటికి గోరంత వెలుగు అన్నట్లుగా మిణుగురులు మినుక్కు మినుక్కుమంటుంటాయి. తిరుమల కొండనుండి దిగుతున్న బస్సులు ఒకదానితో ఒకటి పోటీపడుతుంటాయి. స్వార్థము....కుళ్ళు....కుత్సితము....అసూయా ద్వేషాలతో అలమటించిపోతున్న దేశ కాలగతులను దేవుడనే వాడికి నివేదించాలని కొన్ని పవిత్రాత్మలన్నీ పయనమై ఈ లోకంలో ప్రతి అవసరానికీ అలవాటయిన 'క్యూ' పద్ధతిని మరచిపోలేకుండా ఒకరి వెంబడి ఒకరుగా నిలబడి ఎక్కగలిగినంత మేర పైకెక్కి అటుపై దేవుడనేవాడు కనబడక

పోయేసరికి ఎటూ పోలేక నిలబడినట్లున్నాయి తిరుమల కొండపై కాలి బాటపై వెలుగుతున్న విద్యుద్దీపాలు. చూస్తున్నకొద్దీ ఏదో కొత్తదనం కొట్టి వచ్చినట్లు కనుపిస్తుంది. అందుకే ప్రతిరోజు అక్కడ కనీసం ఓ గంట సేపయినా కూర్చొనకపోతే ఏదో పోగొట్టుకొన్నట్లనిపిస్తుంది.

ఓ రోజు యధాప్రకారం నా దారిన నేను పడ్డాను. కిళ్ళీకొట్టు ముందు కాసేపు నిలబడ్డాను.

అదే వెన్నెల వెలుగులు....చిరునవ్వుల జిలుగులు....పైసల గలగలలు....పడుచుదనం పరిహాస విన్యాసాలు....బాగా సందడిగానే వుంది.

హిప్పీలు సినిమా సంగీతానికి అనుగుణంగా చప్పట్లుకొడుతున్నారు. కొందరామెను కళ్ళతోనే తాగేస్తున్నారు. మరికొందరు చవకబారు జోకులు వాగేస్తున్నారు. ఆమె కనుసన్నల్లో మెదులుతూ ఆమెకు అండదండగా వున్నాడు ఎన్జీవో!

అంతలో ఓ కుర్రవాడు ఆమె వెనుక నిలబడ్డాడు. దాదాపు ఆమె వీపును ఆనుకున్నంత దగ్గరగా నిలబడ్డాడు. ఆమె తలలోని పువ్వులవైపు తదేకదృష్టిని నిలిపాడు. నిమీలిత నేత్రుడై బాగా ఊపిరి ఎగపీలుస్తూ 'అల్లరి ఊహల్ని గిల్లిపెడుతున్నాయండీ మీ సిగలోని మల్లెలు!' అన్నాడు.

చిలిపిగా అతనివైపు చూసిందామె. సిగలో పూవులు చేతికి వచ్చాయి. దోసెడు మల్లెపూల చెండు రెండయింది. ఒకటి ఆ కుర్రవాని చేతికందిస్తూ మరొకటి తలలో తురుముకొనింది. ఆ కుర్రవాడు దేవుని ముందు భక్తుడైనాడు. మహాప్రసాదంలా స్వీకరించాడు. ఆనంద పారవశ్యంతో కళ్ళ కద్దుకొంటున్నాడు.

కొట్టుముందు వెండి వెలుగులు వగలుపడ్డాయి. అందరి కళ్ళల్లో ఆనందం తొణికిసలాడింది. ఎన్జీవో కన్నుల్లో మాత్రం ఎర్రజీర ఎగ్గొట్టుక వస్తున్నట్టు తోచింది.

అక్కడ నిలబడలేకపోయాను!

ఆరుబయట కూర్చున్నాను!!

"ఎందుకలా కుంచించుకుపోతారు. ఎందుకలా అట్టడుగున పడి పోతారు. ఎదగండి. మాలాగా పైకెదగండి. ఈ మోసాలకు వ్యసనాలకు అతీతులుగా పైకెదగండి" అన్న ఓ అమూల్యమైన సందేశాన్ని అందజేస్తున్నట్లున్న తిరుమల కొండలు ఆకాశంలో కలిసిపోతునట్లున్నాయి. ప్రక్కన్నే ఓ ఆసుపత్రి. ఆ ఆసుపత్రిలో ఎన్నో బాధలు. వ్యధలు! వాటికి మించినన్ని కుళ్ళు కుత్సితాల గాథలు. వీటన్నిటినీ దేశానికి పంచడం యిష్టంలేక మూతి ముడుచుక కూర్చున్నాడు వాయుదేవుడు. ఆలోచనలు మాత్రం గుడ్డెద్దు చేనులో పడ్డట్టు సాగిపోతున్నాయి!....

ఈ పాటికి ఈర్ష్యాగ్నిలో పడి ఈదులాడుతుంటాడు ఎస్జీవో!

ఎవరో కాలేజీ కుర్రకుంక....సిగలో మల్లెపూలు....స్వీకరిస్తూవాడు ప్రకటించిన తీరుతెన్నులు .... ఆమె చిరునవ్వులు....యింకనూ కనుల ముందు మెదులుతూనే ఉంటాయి. ఒళ్ళు కుతకుత ఉడికిపోతూ ఉంటుంది. రోజూ కొట్టు కట్టేసేవరకు అక్కడ వుండి ఆమెకు అంతో యింతో సాయపడేవాడు. కానీ ఈ రోజు అక్కడ నిలబడలేక పోతాడు. వెళ్ళి కూర్చుంటాడు యింట్లో లగ్గిమీద.

ఆమె కిళ్ళీకొట్టులోని సామానంతా సర్ది పెడుతుంది. కొట్టు మూసి తాళం వేస్తుంది. ఇంట్లో అడుగుపెడుతుంది. అడుగు పెట్టడమే తరువాయి. అత డామెమీద పడతాడు. చావగొడతాడు. ఎదురుచూడని ఈ సత్కారంతో ఆమె దిగ్భ్రాంతి చెందుతుంది. నోట మాటరాదు. కళ్ళల్లో నీళ్ళు ఆగవు. "ఏంవిటిదంతా? నీ కేంవయినా పిచ్చి పట్టిందా?" అన్నట్లు ఆశ్చర్యంగా చూస్తుందతనివైపు. అతడు ఆరంభిస్తాడు ఆవేశం మోతాదు కలిపి!

"ఛీ! సిగ్గుండక్కర్లే? నా ఖర్మ గాలి బజారు కెక్కితే మాత్రం యింత బరితెగిస్తావా? వాడెవడో కుర్ర ముండాకొడుకు. తల్లో పువ్వులు కావాలంటే తన్ని తగలెయ్యకుండా సగం పూలు వాడికిస్తావా? పదిమంది

చూస్తున్నారని కూడా లేదు. జంకు కొంకూలేదు. ఇంతకూ నేను బతికినట్లా? చచ్చినట్లా?" చిందులు తొక్కుతాడు ఎన్జీవో.

అప్పటికి తెలిసి వస్తుందామెకు అసలు సంగతి. రోషం ముంచుకొని వస్తుంది.

"చేస్తున్నది వ్యాపారం!"

"నే కాదన్నానా"

"అందుకే యిలాంటి వన్నీ అవసరం!"

"ఎవరు చెప్పారు?"

"ఈ యేడాది అనుభవం!"

"ఏమని చెప్పింది?....ఈలాంటి పాడు పనులు చేయమనిగదూ!"

"ఆ మాట కొస్తే ఆడది అంగట్లో కూర్చోవడమే పాడుపని?"

"కూర్చుంటే కులకమన్నానా?"

"మీరు కులకమనరు. పరిస్థితులు కులికిస్తాయి."

"ఏఁవిటీ వాగుడు?"

"లేకపోతే యేఁవిటండీ? ఏడాది కిందట వేసుకున్న చొక్కా మార్చుకోవడానికీ యోగ్యతలేదు మీకు. కడుపునిండా అంత తిని బిడ్డలకు పెట్టే శక్తిలేదు నాకు. ఈ రోజు మీ వేషమే మారింది. నా బిడ్డలు నాలుగు కూరలతో అంత తింటున్నారు. ఎలా వచ్చాయో? ఆలోచించారా!—పోనీ! యిలాంటి కిళ్ళీ కొట్లెన్ని వున్నాయి ఈ వీధిలోనే! వాటివైపు చూస్తే తెలిసిపోతుంది అసలు రహస్యం. ఇప్పుడు లోకానికి కావలసింది సరకు నాణ్యం కాదు. నా చూపుల్లో తళుకు. నా మాటల్లో వగలు. అవే చేస్తున్నాను. సంపాదిస్తున్నాను. అయినా నా ఖర్మ కాకపోతే ఈ గొడవంతా ఎందుకు? కట్టుకున్న వాడివి. కట్టుకోవడానికంత బట్ట. కడుపుకింత తిండి పడేసి నాలుగు గోడలమధ్య తొక్కి పెట్టరాదూ? నేనేఁవయినా కిళ్ళీకొట్టు పెట్టండి. నన్నందులో కూర్చోబెట్టండి. కులకతానని మొత్తుకొన్నానా? కాదంటే అవు

నంటిరి. ఈనాడేవో లేనిపోని సందేహాలతో నన్ను వేపుకు తింటున్నారు. ఎందుకొచ్చిన గొడవ? ఏ నుయ్యో గొయ్యో చూసుకొంటే సరిపోతుంది!"

అభిమానము, ఆవేశము ఒకదానితో ఒకటి పోటీపడి ఆమెను కన్నీళ్ళ పర్యంతం చేస్తే మాట్లాడలేకుండా వెళ్ళిపోతుంది.

ప్రాణపడిపోతాడు ఎన్జీవో!

ఈ అవమానాన్ని భరించలేక కిళ్ళీకొట్టు సుందరి బావిలో పడి చస్తుంది.

నా ఊహలతో ఒళ్ళు జలదరించింది!

ప్రశాంతమైన వాతావరణంలో కూర్చున్నా నా ఆలోచనలు నన్ను ముళ్ళమీద కూర్చోబెట్టాయి. కూర్చోనలేక లేచి నిలబడ్డాను. చెమటలు పోస్తున్నాయి. రాత్రి పదిగంటలు దాటింది. చుట్టూ కలయచూశాను. వాతావరణం ఆహ్లాదకరంగా మారుతూ వుంది.

"అయ్యో! దిసమొలతో నిలబడ్డామే!" అని వృక్షసంతతి దీనంగా ప్రార్థిస్తే వసంతుడు కూడా ప్రజాస్వామ్యానికి విముఖుడేమో మరి? కొందరికి చిలుకపచ్చ చీరలు యిచ్చాడు. కొందరికి అంతంత మాత్రం అందీ అందని వలువలిచ్చాడు. మరికొందరికి 'చూద్దాంలే!' అని నేటి మంత్రివరేణ్యుడిలాగా మాట యిచ్చాడు. అడుగిడుతున్న వసంతశోభ కన్నుల పండువుగా వుంది.

అయినా కూర్చోవడానికి బుద్ధిపుట్టలేదు.

ఇంటిముఖం పట్టాను.

కిళ్ళీకొట్టుముందు యింకను సందడిగనే వుంది.

అనుకోకుండానే కాలు నిలిచిందక్కడ!

"ఏవండీ! సోడా అడుగుతూంటే అలా నిలబడ్డారేం? పాపం! యెంతసేపని నిలబడతారు!" మాటను సాగదీస్తూ ఉంది కిళ్ళీకొట్టులో సుఖాసీనురాలు.

బుద్ధిమంతుడైన కుర్రవాడివలె సోడా అందుకున్నాడు ఎన్జీవో!

అంతలో మరో 'సూట్‌వాలా' ప్రత్యక్షమయ్యాడు.

"ఇదో మిమ్మల్నే! ఆ కుర్చీతీసి అలా వెయ్యండి. వారు కూర్చుంటారు!" ఆజ్ఞలాగా వినిపించింది మాట.

మాట మన్నించాడు ఎన్జీవో!

నాతల తిరుగుతూవుంది. తిరుగుతున్న తలలో సిగలో మల్లెలు.... కుర్రవాడి దోసిట్లో అవి పడిన వగలు....ఎన్జీవో గుండెల్లో లేచిన పొగలు.... ఆరుబయట కూర్చుంటే నాలో చెలరేగిన ఊహలు....

నా ఊహలే నన్ను వెక్కిరించాయి!

* * *

నా దారిన నేను పడ్డాను నెలరోజుల తర్వాత. ఏవో కొన్ని అత్యవసర పరిస్థితుల్లో నేను ఊరువిడిచి వెళ్ళవలసి వచ్చింది. ఊళ్ళో లేకపోయి నప్పటికీ నా మనసు మాత్రం ఆ దారిమీద తిరుగుతూనే వుంటుంది. స్వరాజ్య లక్ష్మి, సువర్ణ, శాంత నా ఆలోచనల అదుపులోనే వుంటారు.

నెలరోజుల తర్వాత ఆ దారిమీద యెంతో ఉత్సాహంగా నడుస్తున్నాను. అనుకోని విధంగా స్వరాజ్యలక్ష్మి కనుపించింది. చూచీ చూడనట్లు నన్ను చూసింది. చూస్తూ నవ్వింది. ఆమె నవ్వుతుంటే పువ్వులు రాలాయి. ఏరు కొన్నాను. గుండెల్లో భద్రపరచుకొన్నాను. సువర్ణ యింతకు మునుపు ఎన్నడూలేని విధంగా సింగారించుకొని బుగ్గలతోనే పలుకరించింది. పరవశించిపోయాను. పిల్లలకోడిశాంత ఓ పిల్లవాడితో నమస్కారం పెట్టించింది.

లేచినవేళ బాగున్నట్లుంది. అనుభూతిని యిముడ్చుకోలేక గుండె కొట్టుకులాడుతూ వుంది. హుషారుగా నడుస్తున్నవాణ్ణి తటాలున ఆగి పోయాను. ఆగి కిళ్ళీకొట్టువైపు చూశాను. కిళ్ళీకొట్టు మూతపడివుంది!

ఆ సమయానికి యెంతో సందడిగా కళకళలాడుతూ ఉండవలసిన ఆ చోటు పాడుగొట్టుకొంటూ వుంది. కారణాన్ని ఊహించలేక ఆ కిళ్ళీకొట్టు

వైపే చూస్తున్నాను. అంతలో యెవరో కాలిమీద గీరుతున్నట్లనిపించింది. ఎవరా? అని చూశాను. ఎవరో ఓ కుర్రవాడు. ఈడ్చికొలిస్తే నా నడుము ఎత్తుకుమించడు. ఏమి చెబుతాడా? అని ఆ పిల్లవానివైపే చూస్తున్నాను. వాడు అదోరకంగా నా మొహంలోకి చూశాడు. అటుతరువాత అమాయకంగా ఆ కిళ్ళీకొట్టువైపు చూశాడు. మళ్ళీ నన్ను చూస్తూ "ఆమె చచ్చిపొయ్యింది!" అన్నాడు.

అప్రయత్నంగా నా కండ్లు నిండుకొన్నాయి.

"అంతే!" తన పని అన్నట్లుగా ఆ పిల్లవాడు ఎటుపోయాడో కనుపించలేదు.

ఆమె యెందుకు చనిపోయింది? ఎలా చనిపోయింది? అని నా మనస్సు పీకుతూనే వుంది. ఆ పీకులాటలోనే రెండు రోజులు గడిచిపోయాయి.

ఆమె చనిపోయింది కిళ్ళీకొట్టులో కూర్చోలేకకాదు. కిళ్ళీకొట్టులో వయ్యారాలుపడుతూ మగనిపోరు పడలేకకాదు. మగని డబ్బుదాహానికి కిళ్ళీకొట్టులోని సరకులతోపాటు తన శీలాన్నికూడా అమ్ముకోడానికి యిష్టపడక! —అని తెలిసుకొన్నపుడు నా గుండె బాధగా మూలిగింది.

ఇది నేను ఊహించని లోతు!

నవంబరు 1979, ఆంధ్రభూమి